సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2023



ఘనంగా జాతర

తాజంగిలో దొంతులమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఊరేగింపునకు రామడోలీని సిద్ధం చేశారు. 8లో



రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం వల్ల అత్యవసర రోగులకు ప్రాణదానం లభిస్తుందని చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. 8లో



గిరి రైతుకు బాసటగా..

మిరియం,పసుపునకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎంపీ మాధవి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అరకు ఎంపీ మాధవి దంపతులు కలిశారు.

మానసాదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవార్ల విగ్రహాలు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో కొలువై ఉన్న సర్పదోషాల నివారిణిగా కొలిచే మానసాదేవి అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయంలోని అమ్మవారి రాతి విగ్రహంతో పాటు ఇటీవల ప్రతిష్ఠించిన పాలరాతి విగ్రహం వద్ద శ్వేతార్క పుష్పాలను ఉంచి స్త్రీ సూక్తంతో అష్టోత్తర పూజ నిర్వహించినట్టు పవనగిరి క్షేత్ర వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు.

ప్రతిరోజూ స్పందన తప్పనిసరి



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: గ్రామసచివాలయాల్లో ప్రతి రోజూ స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. సోమవారం అడ్డతీగల-1,2 గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. విభాగాల వారీగా సిబ్బంది సక్రమంగా విధులకు హాజరైనదీ లేనిది పరిశీలించారు.అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల సమయానికి అన్ని విభాగాల సిబ్బంది అందుబాటుల ఉండి ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్క వినతికి స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం తగదని ఆయన సూచించారు.

'ఆహో కాఫీ' అమ్మకాలకు శ్రీకారం

అనంతగిరి: కాఫీ రైతులు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో శ్రీహర్షిత్ ఆకాంక్షించారు. అనంతగిరి, ఎగువశోభ పంచాయతీల్లో కాఫీ రైతులు ఆహో బ్రాండ్‌తో కాఫీ అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి కాఫీ రైతులంతా సొసైటీగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారంతా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో శ్రీహర్షిత్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు మంచి అవకాశమన్నారు. ఆర్గానిక్ కాఫీకి మంచి డిమాండ్ ఉందన్నారు. నిరుద్యోగులు ఉపాధి మార్గంగా ఎంచుకున్నందుకు అభినందించారు. పర్యాటక ప్రాంతాల్లో ఆహో బ్రాండ్ ద్వారా అనంతగిరి పరిసరా ప్రాంతాల్లో పండే కాఫీతో పర్యాటకులకు మరింత దగ్గరవ్వాలని ఆయన కోరారు.

భూసర్వే వేగవంతం

జేసీ శివ శ్రీనివాస్



రైతులతో మాట్లాడుతున్న జేసీ శివశ్రీనివాస్

డుంబ్రిగుడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతంలో చేపడుతున్న భూ రీసర్వేను రెవెన్యూ అధికారులు వేగవంతం ఏయాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని పోతంగి పంచాయతీ ఊయ్యలగుడలో భూసర్వేను పరిశీలించారు. సర్వే జరిగిన భూములకు సంబంధించి నోటీసులు అందజేసి సక్రమంగా జరిగిందా లేదా అనేది తెలుసుకోవాలని సూచించారు. రీసర్వే విషయంలో రెవెన్యూ అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్, మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ హరి, వీఆర్వో ఝాన్సీ, వీఆర్ఏ బాలయ్య పాల్గొన్నారు.

పులకించిన పొల్లూరు

- ఘనంగా మన్యంకొండ జాతర
- మూడు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం
- పటిష్ట బందోబస్తు మధ్య వనదేవతల శోభాయాత్ర
- పట్టు వస్త్రాలు సమర్పించిన అధికారులు
- భారీస్థాయిలో అన్నదానం, సేవా కార్యక్రమాలు



సీలేరు నదిలోంచి వనదేవతలను తీసుకువస్తున్న పూజారులు

మోతుగూడెం: ఒడిశా గిరిజనుల ఆరాధ్యదైవమైన మన్యంకొండ జాతరకు తరలివచ్చిన భక్తజనం పులకించిపోయారు. ఆంధ్రాతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. ఉదయాన్నే సీలేరు నది వద్ద ఒడిశా పొల్లూరు గ్రామ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు భక్తిశ్రద్ధలతో వనదేవతలను ప్రత్యేకంగా తయారుచేసిన దోనెతో ఊరేగింపుగా తీసుకొని ఆంధ్రా పొల్లూరు గ్రామానికి తీసుకువచ్చారు. ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన మీదుగా ఒడిశా నుంచి వేలాదిమంది గిరిజన భక్తులు తరలివచ్చారు.

జలపాతం వరకు శోభాయాత్ర..

సీలేరు నది దాటిన తరువాత వనదేవతలకు ఆంధ్రా అధికారుల బృందం, ఏఎస్పీ మహేశ్వర్ రెడ్డి, ఏపీ జెన్‌కో ఉన్నత అధికారులు బృందం పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పొల్లూరు జలపాతం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పొల్లూరు జలపాతం వద్ద పూజారులు వనదేవతలకు ప్రత్యేక పూజలు అనంతరం స్నానం చేయించారు. బంగారు చేప కనిపించిందని పూజారులు చెప్పడంతో భక్తులు సంతృప్తి చెందారు. అనంతరం వనదేవతలు పొల్లూరు మీదుగా శోభాయాత్రతో వనదేవతలను ఒడిశాలోని పొల్లూరు గ్రామానికి తరలించారు. రాత్రికి పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి సబ్‌కలెక్టర్ అక్షయ్‌కుమార్, ఐటీడీఏ పీవో మచి త్రినాథ్ యాత్రలో పాల్గొన్నారు. వేలాది మందికి వచ్చిన భక్తులకు పొల్లూరు, మోతుగూడెం ప్రజలతో పాటు జాతర కమిటీ సభ్యులు భోజన ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. అగ్నిమాపకశాఖతోపాటు వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డీఎంహెచ్‌వో పుల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం ఏర్పాటు చేశారు. మోతుగూడెం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుమారు ఐదు వేల మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.పొల్లూరు జాతర కమిటీ సభ్యులు, మోతుగూడెం ప్రజలు 20 వేల మందికి అన్నదానం నిర్వహించారు. భక్తులకు పోలీసుశాఖతో పాటు పొల్లూరు, మోతుగూడెం ప్రజలు, జాతర కమిటీ సభ్యులు వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. వనదేవతలకు మంగళ స్నానం తరువాత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొట్టుదొడ్డిపై పోలీసు అధికారులు పటిష్ఠ భద్రత కల్పించారు.



పొల్లూరు జలాపాతం వద్ద పుణ్యస్నానాలకు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



సీలేరు నదిపై ఏర్పాటుచేసిన తాత్కాలిక బ్రిడ్జి పైనుంచి రాకపోకలు సాగిస్తున్న భక్తులు



పట్టు వస్త్రాలు తీసుకువెళ్తున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, జెన్‌కో అధికారులు



శోభాయాత్రలో వన దేవతల ఊరేగింపు

అర్జీలపై సత్వర స్పందన

- రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభంబన్సల్
- 42 వినతుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్పందనలో అందిన వినతులపై సత్వరమే స్పందించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ఏపీవో (జనరల్) సీహెచ్ శ్రీనివాసరావుతో నిర్వహించిన స్పందనలో 42 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అర్జీల్లో కొన్ని..

- వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని బూసికోట వాగుపై నిలిచిపోయిన వంతెన పనులు పూర్తి చేయాలని పరిసర గ్రామాల ప్రజల తరపున అక్కపల్లి కోటేంద్రం అనే వ్యక్తి వినతిపత్రం అందజేశారు.
- వై. రామవరం మండలం ఎగువ ప్రాంతమైన మారేడుమిల్లి మండలం బంద నుంచి కానివాడ గ్రామం వరకు ఆరు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించాలని సర్పంచ్ పల్లాల శిల్పారాణి కోరారు.
- రాజవొమ్మంగి మండలంలోని లాగరాయిలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన వ్యవసాయ బోరుకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని రైతు కుంజం చిట్టిబాబు అర్జీ అందజేశారు.
- దేవీపట్నం మండలం శరభవరంలో భూ సమస్య పరిష్కరించాలని గ్రామానికి చెందిన కొమరం జగ్గారావు అర్జీ అందజేశారు.
- రంపచోడవరం మండలం పెద్దబారంగిలో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా, భూసమస్య పరిష్కరించాలని కంగల రామకృష్ణదొర కోరారు.
- దేవీపట్నం మండలం తోయ్యేరు గ్రామం పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైనందున 18 సంవత్సరాల కు సంబంధించిన ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని పోసిపోయిన రాజు అర్జీ అందజేశారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- సీహెచ్‌వోలకు సూచన



హెల్త్ ప్రొవైడర్స్‌తో పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీ ఏడు మండలాల్లో కొత్తగా నియమితులైన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గిరిజన ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన మిడ్ లెవెల్ హెల్త్ హెల్త్ ప్రొవైడర్ల (సీహెచ్‌వో) శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని ప్రతి గ్రామానికి వెళ్లి ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే బాధ్యత సీహెచ్‌వోలపై ఉందన్నారు. ఏడు రోజుల శిక్షణలో విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారని సూచించారు. అందుకు తగ్గట్టుగా సేవలందించి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ టి.అనూష, డాక్టర్ ఆనంద్ సత్యతేజ్, డాక్టర్ కె. రాధిక, ఎంపీహెచ్‌వో పీటర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్లకు వెంటనే స్థలాలు

- యుద్ధప్రాతిపదికన అప్పగింత
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతూరు: కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగు పరచడంలో భాగంగా మండలాల్లో సెల్‌టవర్లకు వెంటనే స్థలాలు అప్పగించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సంస్థలకు అప్పగించే స్థలాలకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించి మంజూరు చేయాలని సూచించారు. వ్యక్తిగత బాధ్యతగా చేపట్టి సెల్‌టవర్ల నిర్మాణాలకు స్థలాలను కేటాయించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కొండరెడ్డి తెగ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో 18,074 మందిని నమోదు చేయాల్సి ఉండగా ఆరువేల లోపు మాత్రమే నమోదు చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వచ్చే నెల 15లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. భూముల రీసర్వే మ్యుటేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. తద్వారా అర్హులంతా ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డి.పట్టా భూములకు సంబంధించి వస్తున్న వినతులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిలాలోని ఐదుగురు నోడల్ అధికారులు ప్రతిరోజూ వీటిని సమీక్షిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు 20 శాతం కూడా పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టడం సబబుకాదని ఆయన హెచ్చరించారు. దీనిపై జాయింట్ కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి అందరికీ ఆదేశాలు జారీ చేయాలని, స్పందనలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రేషన్ కార్డులు, పింఛన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ జే. శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవోలు రోణంకి గోపాలకృష్ణ, సూరజ్ ధనుంజయ్ గనోరే, సబ్ కలెక్టర్లు వి. అభిషేక్, శుభం బన్సాల్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

తోకరాయిలో టవర్ నిర్మాణానికి సర్వే



మారుమూల తోకరాయి ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు

సీలేరు: జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ తోకరాయి గ్రామంలో జియో టవర్ నిర్మాణానికి సర్వే నిర్వహించారు. సీలేరు రేంజ్ దారకొండ సెక్షన్ ఆఫీసర్ పి.వివేక్ ఆనందరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆర్.కొండబాబు, ఆర్ఐ మహాదేవ్, జియో టవర్ సర్వేయర్ సెమి రెడ్డి కలిసి అత్యంత మారుమూల కొండ ప్రాంతమైన తోకరాయి గ్రామాన్ని సందర్శించి, సర్వే చేశారు.

రెండు రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి

- సీలేరు కాంప్లెక్స్ సీఈ శ్రీధర్
- మాచ్‌ఖండ్‌లో జాలీ గేట్లు ఏర్పాట్ల పరిశీలన



టీపీ డ్యామ్ వద్ద పనులను పరిశీలిస్తున్న సీఈ శ్రీధర్ తదితరులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో రెండు రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని సీలేరు కాంప్లెక్స్ సీఈ బొడ్డు శ్రీధర్ వెల్లడించారు. సోమవారం ఆయన ప్రాజెక్ట్ టీపీ డ్యామ్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. టీపీ డ్యామ్ జాలీ గేట్లు పడిపోవడానికి కారణాలను ఆయన తెలుసుకున్నారు. జాలీ గేట్ల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున టీపీ డ్యామ్ సిమెంట్ గోడను కట్ చేయవద్దని అధికారులకు సూచించారు. సొరంగమార్గంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం నాలుగు జాలీ గేట్లు చెడిపోయాయన్నారు. అదనంగా మరికొన్ని జాలీ గేట్లను ముందస్తుగా సిద్ధం చేశామన్నారు. విద్యుత్ సౌధ నుంచి జలవిద్యుత్ కేంద్రాల ఎస్ఈ డిజైన్స్ ఎం.శేఖర్, మాచ్‌ఖండ్ ఎస్ఈ కేవీ నాగేశ్వరరావు, ఎస్ఈ సివిల్ ప్రశాంత్ కుమార్, ఈఈలు బి.గోవిందరాజులు,అదిత్య సామంత్రయ్ తదితరులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల' బరిలో 37 మంది

- 4 నామినేషన్ల తిరస్కరణ, ముగ్గురు ఉపసంహరణ
- మార్చి 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
- 16న స్వర్ణభారతి స్టేడియంలో ఉదయం 8 నుంచి కౌంటింగ్
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో 2,89,214 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- నేటి నుంచి బీఎల్వోల ఆధ్వర్యంలో ఓటరు స్లిప్పుల పంపిణీ



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున, అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 37 మంది నిలిచారు. మొత్తం 44 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. ఈ నెల 24 న నిర్వహించిన స్క్రూటినీలో నలుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. మిగిలిన 40 మందిలో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లని ఉపసంహరించుకున్నారు. వీరిలో టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరాములు కూడా ఉన్నారు. సోమవారం ఉపసంహరణ గడువు ముగియడంతో మొత్తం 37 మంది బరిలో నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ మల్లికార్జున ప్రకటించారు. మార్చి 13వ తేదీన పోలింగ్, 16న కౌంటింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ మల్లికార్జున, బందోబస్తుకు సంబంధించిన నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ వివరాల్ని వెల్లడించారు. వైఎస్సార్సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థి డా.వి.చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థి మాధవ్ ప్రధాన పార్టీల తరపున బరిలో ఉన్నారు. అదేవిధంగా ప్రజాసంఘాల తరపున కోరెడ్ల రమాప్రభతో పాటు మిగిలిన వారందరూ స్వతంత్ర అభ్యర్థులే పోటీలో నిలిచారు. 2017 లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 మంది బరిలో నిలవగా.. ఈ సారి 37 మంది ఉండటం గమనార్హం.

- మార్చి 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరగనుంది. 4 లోపు పోలింగ్ స్టేషన్లోకి వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తాం. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఒకే ప్రాంతంలో ఎక్కువ పోలింగ్ స్టేషన్లుంటే.. వీడియో కెమెరాల ద్వారా చిత్రీకరించనున్నాం.
- ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు ఎన్నికల సిబ్బంది ఉంటారు. తక్కువ ఓటర్లున్న స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు సిబ్బంది ఉంటారు.
- 2,89,214 ఓటర్లకు సంబంధించి ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీని మంగళవారం నుంచి బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపడుతున్నాం. ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత ఓటర్లకు స్లిప్పులు అందించి.. అందుబాటులో లేని వివరాలతో కూడిన ఏఎస్‌డీ జాబితాని 10 రోజుల్లో సిద్ధం చేసి ప్రిసైడింగ్ అధికారులకు అందజేసి, మాల్ ప్రాక్టీస్‌లకు పాల్పడకుండా చర్యలు చేపడుతున్నాం.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున అభ్యర్థులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్‌తో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సీపీ సీహెచ్ శ్రీకాంత్, అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్‌తో కలిసి ఆర్వో, కలెక్టర్ డా.మల్లికార్జున వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సీతంరాజు సుధాకర్ విజయమే లక్ష్యం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ళ భాగ్యలక్ష్మి, పార్టీ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, ట్రై కార్ చైర్మన్ బుల్లిబాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయమే లక్ష్యం కావాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పార్టీ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఐదు మండలాల పార్టీ ముఖ్య నేతలతో సోమవారం పాడేరు ఎమ్మెల్యే నివాసంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో భాగ్యలక్ష్మి మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గత ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పార్టీ అభ్యర్థుల విజయానికి ఎంతగానో కృషి చేశారని, ఆయన సేవలను గుర్తించి సీఎం వైఎస్ జగన్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ పార్టీ బలపర్చిన అభ్యర్థి విజయానికి ప్రణాళికబద్ధంగా పని చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు 10 మందిని పరిశీలకులుగా, ఈవిధంగా నియోజకవర్గంలోని ఐదు మండలాలకు నియమించినట్టు చెప్పారు. పాడేరు మండలానికి రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, జి.మాడుగుల మండలానికి పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, మాజీ ఎంపీపీ ఎస్వీ రమణమూర్తి, చింతపల్లి మండలానికి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, జీకే వీధికి జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మిని నియమించినట్టు తెలిపారు. కొయ్యూరు మండలానికి జీకే వీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజులను నియమించామని చెప్పారు. వీరంతా పార్టీ అభ్యర్థి విజయానికి విశేష కృషి చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె. సూరిబాబు, పార్టీ అనుబంధ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, వైస్ ఎంపీపీ కె. కనకాలమ్మ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర

చింతపల్లి: మండలంలోని తాజంగిలో నాలుగేళ్ల కోసారి నిర్వహించే దొంతులమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేషధారణలో ఉన్న చిన్నారులను ఊరేగించేందుకు రామడోలీని సిద్ధం చేశారు. సీత, రామ, లక్ష్మణ, భరత, శత్రఘ్నుల వేషధారణలో ఐదుగురు చిన్నారులు నాలుగు రోజులపాటు కొండపై వెలసిన గుహలో ఉంటారు. వీరికి ఆలయ సిబ్బంది పండ్లు, పాలు మాత్రమే అందజేస్తారు. కొండపై ఉన్న ఆలయం వద్ద దాదాపు 100 అడుగుల ఎత్తులో ఊయలను ఏర్పాటుచేశారు. ఐదుగురు చిన్నారులను రామడోలిలో ఊరేగించిన తరువాత ఊయల ఎక్కించి ఊపుతారు. మంగళవారం జరిగే ఈ కార్యక్రమానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు.





నేడు, రేపు గంగమ్మ తల్లి ఉత్సవాలు

ముంచంగిపుట్టు: పెదగూడ పంచాయతీ కేంద్రంలో గంగమ్మతల్లి ఉత్సవాలను ఈ నెల 28, వచ్చే నెల 1వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 28వ తేదీ రాత్రి అమ్మవారికి ఘటాలను సమర్పించి, బుడియాలు విన్యాసాలు ప్రదర్శిస్తారు. 1వ తేదీన భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.

విజయ సారథులు మీరే

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం

దేవీపట్నం: గృహసారథులులే వైఎస్సార్‌సీపీ విజయసారథులని, ఎన్నికలు ఎప్పుడువచ్చినా పార్టీని విజయపథంలో నడిపించేందుకు సిద్ధంగా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో గృహసారథులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గృహసారథులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ భూములను త్యాగం చేసిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా సత్యనారాయణ,కందులబాబ్జీ,గారపాటి మురళీకృష్ణ, శిరశం పెద్దబ్బాయిదొర, ఒగ్గి సునంద తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కీలకపాత్ర పోషించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. ఏటిపల్లి గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కామరాజుదొర, కుంజం లక్ష్మి తదితరులు ప్రసంగించారు. తోట రాజేశ్వరరావు, వైస్‌ఎంపీపీలు కె.రామతులసి, కుంజం గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, వెంకటలక్ష్మి, అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సూరంపూడి ఏడుకొండలు, పార్టీ మండల ఇన్‌చార్జ్ సీహెచ్.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఏటిపల్లి గ్రామం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రక్తదానంతో ప్రాణదానం

చింతూరు: రక్తదానం వల్ల అత్యవసర రోగులకు ప్రాణదానం లభిస్తుందని చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. పాడేరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవరం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభించక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అలాంటి వారికి ఈ రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పీవో సూచించారు. 15 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు గంగరాజు, కార్యదర్శి ఈశ్వరరావు, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా భజన పోటీలు

పెదబయలు: భీమలింగేశ్వర స్వామి ఉత్సవం సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో భీమలింగేశ్వర స్వామి ఆలయం,హరిపుత్ర అయ్యప్ప పీఠం ప్రాంగణాల్లో సోమవారం భజన పోటీలు ఉత్సాహంగా జరిగాయి.ఈ పోటీల్లో 15 బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో వరుసగా కొత్త సుజనకోట, సీకరి,ఒడిశా రాష్ట్రం ఓంద్రుగెడ్డ బృందాలు నిలిచాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ డైరెక్టర్ నాగేశ్వరరావు, మండల కోఆర్డినేటర్ శోభ ప్రియాంక, వంతినిభ సత్యనారాయణ పాల్గొన్నారు.



లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

అరిలోవ: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్య విభాగం విస్తరణ మీడియా అధికారి బి.నాగేశ్వరరావు తెలిపారు. పైనాపిల్ కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనన్నారు. రాష్ట్రంలో 1000 మంది పురుషులకు 948 మంది స్త్రీలు ఉన్నారన్నారు. విశాఖ జిల్లాలో 1000 పురుషులకు 952 మంది స్త్రీలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1000 మంది పురుషులకు 972 మంది స్త్రీలు ఉన్నట్టు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం తగదని, దీనిపై ఆశా వర్కర్లు గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశం డీపీహెచ్ఎన్‌వో సత్యవతి, హెచ్ఈఈవో కె.ధర్మశ్రీ, సీహెచ్‌వో లక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ మణికుమారి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్య విభాగం అధికారులు

ఓటర్ల జాబితాల ప్రదర్శన

సాక్షి,పాడేరు: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు వీలుగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ,హుకుంపేట మండలం శోభకోట,పెదబయలు మండలం పెదకోడాపల్లి,రంపచోడవరం మండలం ఆకూరు పంచాయతీల్లో సర్పంచ్ పదవులు, పలు పంచాయతీల్లో 66వార్డు సభ్యుల స్థానాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఆయా పంచాయతీల్లో ఎన్నికలకు వీలుగా ఓటర్ల జాబితాలను సోమవారం నుంచి ప్రదర్శిస్తున్నామని డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్ తెలిపారు. ఈఏడాది జనవరి 5వ తేదీన ప్రచురించిన అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా ఈ జాబితాలను రూపొందించినట్టు ఆయన చెప్పారు.


శోభకోట పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితాను అతికిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాఠశాలను మూసివేయొద్దు

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కిమిడిపుట్టు ఎంపీపీ పాఠశాల మూసివేత నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వైస్ ఎంపీపీ వి.సత్యనారాయణ కోరారు. కుమిడిపుట్టు పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులతో గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలను మూసివేస్తే పిల్లలు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళా సంఘం ప్రతినిధులు విజయ,ఈశ్వరి,పూర్ణిమ, పోర్తిమ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లు దగ్ధం.. రూ.5 లక్షల ఆస్తి నష్టం

హుకుంపేట: ప్రమాదవశాత్తూ ఇల్లు దగ్ధమై రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గత్తుం గ్రామానికి చెందిన పాంగి మత్స్యరాజు ఇల్లు ఆదివారం రాత్రి కాలి బూడిదైంది. ఈ అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని ఇంటి యజమాని తెలిపారు. గ్రామంలో ఆరోజు శుభ కార్యం జరగడంతో కుటుంబం మొత్తం బంధువుల ఇంటివద్దకు వెళ్లామని అదే సమయంలో ఇల్లు కాలిపోయిందని ఆయన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ ఆర్ఐ రంగారావు గ్రామానికి చేరుకుని దగ్ధమైన ఇల్లు, ఇంట్లో సామగ్రి పరిశీలించి సుమారుగా రూ.5లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉందని తెలిపారు. నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు.


గత్తుంలో దగ్ధమైన ఇల్లు, సామగ్రి

20 లీటర్ల సారాతో భార్యాభర్తల అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు, వంటపాత్రలు

కొయ్యూరు: ఎం మాకవరం శివారులో సోమవారం పోలీసులు సారా బట్టీలపై దాడులు చేశారు. 1200 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వాడుతున్న వంటపాత్రలను ధ్వంసం చేశారు. ఎస్ఐ రాజారావు మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో దాడులు జరిపామన్నారు. దాడుల్లో 1,200 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశామని, సారా కాస్తున్న భార్యాభర్తల నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.


స్వాధీనం చేసుకున్న సారాను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ పోలీసులు

నాటుసారా ధ్వంసం

రంపచోడవరం: డిప్యూటీ కమిషనర్ విశాఖపట్నం ఎస్ఈబీ ఉత్తర్వుల ద్వారా రంపచోడవరం ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 123 కేసుల్లో పట్టుబడిన నాటు సారా (1437 లీటర్లను)ను ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.ఆనంద్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ నాటు సారా, అక్రమ మద్యం, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఎస్ఈబీ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. టోల్ ఫ్రీ నంబరు 14500లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఆటో బోల్తా

కొయ్యూరు: మర్రివాడ పంచాయతీ దొడ్డవరం సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న బూదరాళ్ల పంచాయతీ ముకుడుపల్లికి చెందిన సాగిన చంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను 108లో రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆటోలో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఎంపీపీ బడుగు రమేష్ బాధితుడు చంద్రరావును పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఇనుప డ్రమ్‌లో లిక్విడ్ పేలి ఒకరికి గాయాలు

హుకుంపేట: పసుపు ఉడకబెట్టేందుకు తీసుకొచ్చిన ఇనుప డ్రమ్ పేలి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. మట్టుజోరు పంచాయతీ కుంతుర్ల గ్రామానికి చెందిన మర్రి గణేష్ తాను పండించిన పసుపు ఉడకబెట్టడానికి వారపు సంతలో ఇనుప డ్రమ్ కొనుగోలు చేశారు. డ్రమ్ మూతను ఎలక్ట్రికల్ మిషన్‌తో కట్ చేయడంతో డ్రమ్‌లో ఉన్న కొంచెం లిక్విడ్ ఒక్కసారిగా ఫైర్ అయింది. దీంతో గణేష్ శరీరం మొత్తం కాలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108లో పాడేరు జిల్లాఆస్పత్రికి తరలించారు.ఆయనకు ప్రాణపాయం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.





గిరి రైతుకు బాసటగా..

- పసుపు, మిరియాలకు గిట్టుబాటు ధర
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు
- దళారి వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం
- కసరత్తు చేపట్టిన గిరిజన సహకార సంస్థ

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న మిరియం, పసుపునకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే ఆయన వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి సూచనలు జారీ చేశారు. దీంతో గిరిజన సహకార సంస్థ ఏజెన్సీ వాణిజ్య పంటల కొనుగోలు సాధ్యతపై దిగువస్థాయి అధికారుల నుంచి నివేదికలు కోరింది. పాడేరు,చింతపల్లి జీసీసీ డివిజన్ల పరిధిలో ప్రస్తుతం మిరియాలు, పసుపు పంటల దిగుబడి, మార్కెట్‌లో వ్యాపారులు చెల్లిస్తున్న ధరలపై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షించారు. పసుపు కిలో రూ.70, మిరియం కిలో రూ.350 చొప్పున వ్యాపారులు చెల్లిస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర పతనం చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్తున్నాయి. వీరి అక్రమాలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఆయన ట్రేడర్లు, ,పలుశాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన ఆదేశాల మేరకు పాడేరు డివిజన్‌లోని మిరియాలు, పసుపు కొనుగోలు జీసీసీ కసరత్తు ప్రారంభించింది. కొనుగోలు ధరలను నిర్ణయించేందుకు జీసీసీ అపెక్స్ కమిటీ సమావేశం కానుంది. యాజమాన్యం ధరలు ప్రకటించిన వెంటనే మార్చి మొదటివారంలో కొనుగోళ్లు చేపడతామని పాడేరు జీసీసీ డీఎం పార్వతమ్మ సాక్షికి తెలిపారు.


మిరియాలు

మిరియాలు కిలో రూ.400



ఏజెన్సీలో గిరిజనులు పండిస్తున్న విరియాలకు గిట్టుబాటు ధర కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నారు. కిలో రూ.400కు పైగా ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.జీసీసీ, ట్రెడర్లు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చాం. ఎక్కడ మోసాలు జరిగినా తమకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

– సుమిత్‌కుమార్, కలెక్టర్

భోజన ప్యాకెట్లు పంపిణీ

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారపు సంత, ఇతర పనులపై వచ్చిన 160 మందికి వీటిని అందజేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో గిరిజన మహిళకు దొరకని బెడ్

- వార్డులో కింద నిద్రించినట్టు ప్రచారం
- బెడ్ ఇచ్చామంటున్న సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్‌లో గిరిజన మహిళకు బెడ్ కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి పిల్లల వార్డులో గిరిజన పసికందు మృతి చెందడం, మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించిన ఘటన మరిచిపోక ముందే మరో గిరిజన మహిళకు బెడ్ ఇవ్వలేదన్న ప్రచారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలం వనగుమ్మ గ్రామానికి చెందిన కె.కృష్ణవేణిని తల్లిదండ్రులు ఈనెల 25న వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరింది. దీంతో 25వ తేదీ రాత్రి భావనగర్ వార్డులో చేర్పించి చికిత్స అందజేశారు. వ్యాధి తగ్గుముఖం పట్టడంతో కృష్ణవేణిని రాజేంద్రప్రసాద్ వార్డు 'డి' బ్లాక్‌కు ఆదివారం తరలించారు. అక్కడ పడకలు ఖాళీ లేవు. మరో మహిళ ఉండే మంచాన్ని కృష్ణవేణికి కేటాయించారు. అంటే ఒకే మంచాన్ని ఇద్దరు ఉపయోగించాలి. అయితే ఈ మంచం తీసుకోవడానికి కృష్ణవేణి నిరాకరించారు. అప్పటికే ఆ వార్డులో ఒక మహిళ చనిపోవడంతో కృష్ణవేణి అక్కడ ఉండడానికి నిరాకరించినట్లు బంధువులు తెలిపారు. అయితే కృష్ణవేణి ఆ వార్డులోనే కింద పడుకుని రాత్రి నిద్రించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెల్లవారే సరికి జిల్లాలో వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఆగమేఘాల మీద కృష్ణవేణికి బెడ్ కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, వార్డులో పడకలు ఖాళీ లేకపోయినా ఆ మెకు బెడ్ ఇచ్చామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. రోగిని బెడ్ మీదకు మార్పు చేస్తున్న సమయంలో ఎవరో ఫొటో తీశారని, ఆమెకు మంచం నిరాకరించినట్టు ప్రచారం చేస్తున్నారని సూపరింటెండెంట్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.


మంచం మీద తల్లిదండ్రులతో కృష్ణవేణి


కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో నేల మీద పడుకున్న గిరిజన మహిళ



అరకు మహిళా డిగ్రీ కాలేజీకి 29 పోస్టులు మంజూరు

సాక్షి,పాడేరు: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం 29 పోస్టులు మంజూరు చేసింది. వీటిలో 23 లెక్చరర్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు ఉన్నాయి. లెక్చరర్ పోస్టులను డైరెక్ట్ పద్ధతిలో, నాన్‌టీచింగ్ స్టాఫ్ పోస్టులను అవుట్ సోర్సింగ్‌లో నియమించనున్నారు. తెలుగు–1, ఇంగ్లిషు–1,హిందీ–1, హిస్టరీ–1,ఎకనామిక్స్–1,పొలిటికల్ సైన్స్–1,కామర్స్–3,కంప్యూటర్ సైన్స్,అప్లికేషన్స్–2,మ్యాథ్స్–2, ఫిజిక్స్–2, కెమిస్ట్రీ–2, బోటనీ–2, జువాలజీ –2,లైబ్రేరియన్–1, ఫిజికల్ డైరెక్టర్–1 కలిపి మొత్తం 23 టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఈనెల 22న ఉత్తర్వులిచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. రామకృష్ణ తెలిపారు.అవుట్ సోర్సింగ్ పద్ధతిలో జూనియర్ అసిస్టెంట్–1,స్టోర్ కీపర్–1,రికార్డు అసిస్టెంట్–1,ఆఫీస్ సబార్డినేట్–2, కంటింజెంట్–1 కలిపి మొత్తం 6 పోస్టులను మంజూరు చేసింది. ఇక్కడ పోస్టుల భర్తీకి కృషి చేసిన ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు,అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉన్నత విద్యాశాఖ కమిషనర్,ఉన్నతాధికారులకు ఇక్కడ ప్రిన్సిపాల్, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.